సాక్షి మంచిర్యాల

మంగళవారం । 28 । జనవరి । 2025



‘ఉపాధి’లో పొలంబాట 8లో▸

ఉపాధి హామీ పథకంలో గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల పొలాలకు రోడ్లు వేయనున్నారు. మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.



జంగుబాయికి మొక్కు

జంగుబాయి ఉత్సవాలు ముగియనున్నాయి. ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి 2.10లక్షల మంది భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారని అంచనా. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /16.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఎస్సైలకు శిక్షణ



సీసీసీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలు

నస్పూర్: రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు కొత్తగా నియామకమైన ఎస్సైలకు ఉద్యోగ విధుల నిర్వహణపై స్థానిక సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుగుణాకర్ సోమవారం శిక్షణ ఇచ్చారు. కమిషనరేట్‌కు 20మందిని సివిల్ పోలీస్ ఎస్సైగా నియమించారు. పోలీస్ ఉద్యోగంలో చేరిన కానిస్టేబుల్ మొదలుకుని రైటర్ వరకు కేసుల నమోదు, వర్టికల్, అడ్మిన్ విధులు, ఫిర్యాదుదారులతో వ్యవహరించే తీరుపై అవగాహన కల్పించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆందోళన



నినాదాలు చేస్తున్న బస్తీ వాసులు

బెల్లంపల్లి: విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని కన్నాలబస్తీ, టేకులబస్తీ వాసులు, రిటైర్డు కార్మికులు స్థానిక సింగరేణి పాత జీఎం కార్యాలయం ఆవరణలోని విద్యుత్ విభాగం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ జరిపిన చర్చల ప్రకారం బాక్సులు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించిన ప్రాంతాల్లో బేషరతుగా కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ కౌన్సిలర్ పొట్ల సురేష్ మాట్లాడుతూ కన్నాలబస్తీ, హన్మాన్‌బస్తీ, టేకులబస్తీల్లో విద్యుత్ స్తంభాలపై కరెంటు బాక్సులు, ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకెళ్లారని తెలిపారు. కరెంటు సరఫరా నిలిపేసి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. మున్సిపాలిటీ నుంచి ఇంటినంబర్లు జారీ కాకపోవడం వల్ల మీటర్లు తీసుకోవడానికి ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కోల్ ఇండియా హాకీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

శ్రీరాంపూర్: ఈ నెల 28 నుంచి మధ్యప్రదేశ్‌లోని సింగ్రోలి పట్టణంలో జరిగే కోల్ ఇండియా హాకీ పోటీలకు శ్రీరాంపూర్ చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. సింగరేణి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జట్టులో వీరు సభ్యులుగా ఉన్నారు. ఇటీవల జరిగిన కంపెనీ స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో శ్రీరాంపూర్ నుంచి తోట సురేష్(ఈపీ ఆపరేటర్, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్), ఎద్దు సదయ్య(సెక్యూరిటీ గార్డ్ ఎస్అండ్‌పీసీ), బెల్లం తిరుపతి(జనరల్ మజ్దూర్, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు), జీ.నరేందర్(కోల్‌కట్టర్, ఆర్కే7), ఎల్.రాజేష్(కోల్‌కట్టర్, ఆర్కే7) ఉన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థిని

జైపూర్: జైపూర్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ఈ.సంజన జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైంది. సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్, పీడీ గోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. వచ్చే నెల రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

బోధనోపకరణాలు పంపిణీ

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో సోమవారం విద్యార్థుల సామర్థ్యాల మెరుగుకు బోధనోపకరణాలు పంపిణీ చేశారు. జిల్లాలో ఎంపిక చేసిన 85 ప్రాథమిక పాఠశాలలకు ఎఫ్ఎల్ఎన్ వండర్‌బాక్సులు, 18 కేజీబీవీలకు ఒకసైన్స్ కిట్, ఒక మ్యాథ్స్ కిట్ చొప్పున ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.మధుబాబు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఖాళీలు 315

- లెక్కతేల్చిన అధికారులు
- ప్రాజెక్టుల వారీగా వివరాలు పంపిన సీడీపీవోలు
- వచ్చే నెలలో భర్తీకి ప్రభుత్వం కసరత్తు

మంచిర్యాలటౌన్: చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించడంతోపాటు పూర్వ విద్యనందిస్తూ, బడికి వెళ్లేందుకు సంసిద్ధం చేసేలా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ శాఖ తన పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, ఆయాలు, ఖాళీల వివరాలతోపాటు ఏ నెలలో ఎంతమంది ఉద్యోగ విరమణ పొందనున్నారనే వివరాలనూ అన్ని జిల్లాల నుంచి ఇటీవల సేకరించారు. జిల్లాలోని నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అంగన్‌వాడీ టీచర్ల ఖాళీలు 62, ఆయాల ఖాళీలు 253 ఉన్నట్లు గుర్తించి నివేదిక అందజేశారు. టీచర్లు, ఆయాలు లేక పలు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పక్కనే ఉన్న మరో అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తున్న వారికి అప్పగించారు. దీంతో అదనపు భారంగా మారుతూ ఏ కేంద్రంలోని చిన్నారులకు ప్రభుత్వం ఆశించిన లక్ష్యం మేరకు లబ్ధి చేకూరడం లేదు. ఎన్నో ఏళ్లుగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేక ఆ ప్రాంతానికి చెందిన వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగ విరమణ..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తూ 65ఏళ్లు పైబడిన టీచర్లు, ఆయాల రిటైర్మెంట్ ప్రక్రియ గత ఏడాదిగా కొనసాగుతోంది. గత ఏడాది జూలై ఒకటి నాటికి 65ఏళ్లు పైబడిన వారికి రిటైర్మెంట్‌ను ప్రకటించగా.. ఇప్పటివరకు 13మంది టీచర్లు, 122మంది ఆయాలు ఉద్యోగ విరమణ పొందారు. గత ఖాళీలతోపాటు రిటైర్మెంట్‌తో ఏర్పడుతున్న ఖాళీల సంఖ్య ప్రతీ నెల పెరుగుతూ వస్తోంది. ఖాళీలను భర్తీ చేస్తారని ఏడాదికి పైగా ఎదురు చూస్తున్నా ఆ దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇటీవల ప్రభుత్వం ఖాళీల వివరాలు జిల్లా అధికారుల నుంచి సేకరించడంతో వచ్చే నెలలో ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయనుందని తెలుస్తోంది. ఖాళీలను భర్తీ చేస్తే ఆ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు ఆయా కేంద్రాల నుంచి అందాల్సిన పౌష్టికాహారం సక్రమంగా అందేందుకు అవకాశం ఉంటుంది. ఖాళీల సంఖ్య ఎక్కువగా పెరుగుతుండడంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై ఆ భారం పడుతోంది. గత ఏడాది నుంచి టీచర్లు, ఆయాల రిటైర్మెంట్ ప్రక్రియ కొనసాగుతుండగా, వారి స్థానంతోపాటు గతంలో ఖాళీలుగా ఉన్న స్థానాల్లో నియామకాలను చేపడతారని చెబుతున్నా ఏడాదిగా కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికే ఖాళీల వివరాలను రాష్ట్ర శాఖ తెప్పించుకోవడంతో భర్తీకి అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు(ఫైల్)

జిల్లాలో ఖాళీల వివరాలు ప్రాజెక్టుల వారీగా

ప్రాజెక్టు	అంగన్‌వాడీ టీచర్లు	ఖాళీలు	ఆయాలు	ఖాళీలు	కేంద్రాలు
బెల్లంపల్లి	279	267	12	225	54
చెన్నూరు	245	227	18	169	76
లక్సెట్టిపేట	203	189	14	151	52
మంచిర్యాల	242	224	18	171	71
మొత్తం	969	907	62	716	253

వివరాలు పంపించాం



జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, ఆయాలకు సంబంధించి ఖాళీల వివరాలను ఇప్పటికే రాష్ట్ర శాఖకు పంపించాం. ఖాళీల భర్తీ కోసం చర్యలు తీసుకోవడంలో భాగంగానే వివరాలు తీసుకోవడం జరిగింది. వచ్చే నెలలో భర్తీ ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది.

– రౌఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

ఖాకీ ముసుగు..!

- పోలీసుల పేరిట దందాలు, సెటిల్‌మెంట్లు
- జిల్లా కేంద్రంలో ఓ నకిలీ పోలీసు అరెస్టు
- జిల్లాలో ముఠా సంచారం..?

మంచిర్యాలక్రైం: జిల్లాలో కొందరు ఖాకీ ముసుగులో సెటిల్‌మెంట్లు, దందాలకు పాల్పడుతున్నారు. పోలీసులమని, ఉన్నతాధికారుల గన్‌మెన్ అని, ఆ అధికారి మాకు బాగా దగ్గరని వసూళ్లకు తెర తీస్తున్నారు. రేషన్‌బియ్యం, ఇసుక, మట్టి, స్క్రాప్, మద్యం దుకాణాల యజమానులను బెదిరిస్తున్నారు. సమస్యలతో పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పరిచయాలు పెంచుకుని అధికారులతో మాట్లాడుతామంటూ అందినకాడికి దండుకుంటున్నారు. ఈ నెల 16న బెల్లంపల్లికి చెందిన పానుగంటి రాజు మంచిర్యాలలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవించాడు. తుపాకి చూపించి తాను పోలీసునంటూ బెదిరించి బిల్లు చెల్లించకుండా ఉడాయించాడు. ఈ ఘటనలో రాజుతోపాటు మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నా.. ఆ తుపాకి డమ్మీదా.. నిజమైనదేనా అనే స్పష్టత ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రంలో కొందరు యువకులు రాత్రివేళ పోలీసులమంటూ బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలోని శివారు ప్రాంతాలు తిలక్‌నగర్, రాజీవ్‌నగర్, కాలేజ్‌రోడ్, ఏసీసీ క్వారీ రోడ్ ప్రాంతాల్లో ఓ ముఠాగా ఏర్పాడి అక్రమ ఇసుక రవాణా, రేషన్ బియ్యం, స్క్రాప్ వాహనాలను అడ్డుకోవడం, డబ్బులు వసూలు చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో అల్లరిమూకల అలజడి ఎక్కువవుతోంది. పలువురు పెద్దల కనుసన్నల్లో ముఠా భూ వివాదాలు, సెటిల్‌మెంట్లు, భౌతికదాడులు, దోపిడీలకు పాల్పడుతోంది. డమ్మీ ఎయిర్ గన్స్, డమ్మి పిస్తోళ్లు ఉపయోగించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వీరిపై పోలీసులు కేసులు నమోదు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు గానీ వెనుక ఎవరున్నారనేది విషయంలో విచారణ చేయడం లేదు.

- గత ఏడాది దీపావళి పండుగ సందర్భంగా కొందరు స్థానిక సీఐ పేరు చెప్పి నిర్వాహకుల నుంచి మామూళ్లు వసూలు చేసినట్లు తెలిసింది. వసూలు చేసిన వాళ్లు నకిలీలా.. అసలా అనేది అర్థంకాక ఎంతో కొంత ముట్టజెప్పి చేతులు దులిపేసుకున్నామని వ్యాపారులు చెప్పడం గమనార్హం.
- లక్సెట్టిపేట మండల కేంద్రంలో ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు బ్యాంకులో రూ.లక్ష డిపాజిట్ చేసేందుకు వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు సీఐడీ పోలీసులమంటూ బెదిరించారు. పాత నోట్ల వ్యవహారంలో కొత్త నోట్లు మార్పిడి చేస్తున్నారని తెలిసిందంటూ దబాయించారు. పోలీస్‌స్టేషన్‌కు పదా అంటూ రూ.లక్షతో ఉడాయించారు.
- 2020 జనవరి 5న జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన మేకల వ్యాపారి ఖాలుఖాన్ శ్రీరాంపూర్‌లోని పలువురు మేకల వ్యాపారుల వద్ద తనకు రావాల్సిన డబ్బు తీసుకెళ్తుండగా.. ఇంత డబ్బు ఎక్కడిది, విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు రావాలంటూ బెదిరించిన నకిలీ పోలీసులు రూ.9.50లక్షలతో ఉడాయించారు. ఈ ఘటనలో నకిలీ పోలీస్ అవతారామెత్తిన మధ్యప్రదేశ్‌లోని మాతేపూర్‌కు చెందిన గబ్బర్, వికాస్, పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌కు చెందిన సుభాష్, రామగుండంకు చెందిన పిపాల రమేష్, మంచిర్యాల శ్రీరాంపూర్‌కు చెందిన మాటేటి రాజులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



బార్ అండ్ రెస్టారెంట్‌లో తుపాకి చూపించి బిల్లు చెల్లించకుండా ఉడాయించిన నకిలీ పోలీస్ రాజు(ఫైల్)

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు...



పోలీసుల పేరుతో అక్రమాలకు పాల్పడిన నకిలీ పోలీసులపై కఠినమైన చర్యలు తప్పవు. పోలీసులైనా, నకిలీ పోలీసులైనా పోలీస్ పదం ఉపయోగించి అక్రమాలకు పాల్పడడం నేరం. అక్రమాలు, సెటిల్‌మెంట్లు, పంచాయితీలు, అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. ఎవరైనా పోలీసులమని వసూళ్లకు పాల్పడితే స్థానిక అధికారులకు గానీ 100 డయల్‌కు సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ మంచిర్యాల

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జన్నారం: స్కీంలో పెట్టుబడి పెడితే అనేక లాభాలు వస్తాయని మోసగించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాడి మురళిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి యాదయ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో ని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మురళి విధులు నిర్వర్తిస్తున్నాడు. తన్విత ఆయుర్వేదిక్ స్కీంలో పెట్టుబడి పెడితే లాభా లు వస్తున్నాయని నమ్మబలికాడు. దీంతో కలమడుగు పాఠశాలకు చెందిన మరో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మామిడి నర్సయ్య రూ.24 లక్షలు ఇచ్చాడు. లాభాలు రాకపోవడం, డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ నెల 14న మురళిపై కేసు నమోదు కాగా.. 24న అరెస్టు చేశారు. మురళి లక్సెట్టిపేట సబ్‌జైలులో ఉన్నందున పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న ఇచ్చిన నివేదిక ఆధారంగా అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మున్సిపాలిటీల ప్రత్యేక అధికారిగా కలెక్టర్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని మున్సిపాల్టీల ప్రత్యేక అధికారిగా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. బల్దియాల పాలకవర్గ పదవీ కాలం ముగిసిపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించిన విషయం తెలిసిందే. మందమర్రి మున్సిపాల్టీకి ఎన్నికలు లేక ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగుతుండగా.. నస్పూర్ మున్సిపాల్టీని మంచిర్యాలలో కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుండడంతో ప్రత్యేక అధికారి పాలనలో మినహాయించారు. మంచిర్యాల, లక్సెట్టిపేట, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, చెన్నూరు మున్సిపాలిటీలకు జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)కు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్‌కు ఇన్‌చార్జి జిల్లా అదనపు కలెక్టర్ బాధ్యతలూ ఉండడంతో మున్సిపాలిటీల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనను మంచిర్యాల, బెల్లంపల్లి, క్యాతన్‌పల్లి, లక్సెట్టిపేట, చెన్నూర్ కమిషనర్లు మారుతిప్రసాద్, శ్రీనివాస్, రాజు, రాజశేఖర్, మురళీకృష్ణ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కలెక్టర్ కుమార్ దీపక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్లు

ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంచాలి

పాతమంచిర్యాల: జిల్లా నుంచి ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, ఉద్యానవన, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, బ్యాంకింగ్, వ్యవసాయ శాఖల అధికారులతో జిల్లాలో ఉత్పత్తులు–ఎగుమతు లు అనే అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించా రు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, పరి శ్రమ రంగాలను ప్రోత్సహిస్తూ ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంపొందించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను అభివృద్ధి చేస్తూ అధిక మొత్తంలో ఉత్పాదకతను పెంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా కృషి చేయాలని తెలిపారు. మామిడి, వరిధాన్యం ఎగుమతిపై దృష్టి సారించాలని, ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్‌స్టోరేజీ కేంద్రాలు ఏర్పాటు చేసి నాణ్యమైన ఉత్పత్తుల ఎగుమతి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో కులవృత్తుల వారికి ఆర్థిక చేయూత అందించడానికి కృషి చేస్తామని అన్నారు. విశ్వకర్మ పథకంపై ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాలక్రైం: దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం 2025 క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను అందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డెవిల్ ఫేయిర్ శాఖాధికారి, జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారులు, ఆ సంఘం అధ్యక్షుడు సీహెచ్.బాపు, ఉపాధ్యక్షుడు జీ.తిరుపతి, జనరల్ సెక్రెటరీ కే.తిరుపతి, అసోసియేట్ ప్రెసిడెంట్ మురళి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ తిరుపతి, కోశాధికారి సురేందర్, దివ్యాంగ ఉద్యోగులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పరిష్కరిస్తాం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

పాతమంచిర్యాల: ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖ డైరీ–2025ని చెన్నూర్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రకళతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- జన్నారం మండలం కవ్వాల్‌కు చెందిన పెరోజ ఖాను తన భర్త ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లి వచ్చిన నెల రోజులకే క్యాన్సర్‌తో చనిపోయాడని, జీవో 216ప్రకారం పరిహారం అందించి ఆదుకోవాలని కోరింది.
- మంచిర్యాలకు చెందిన నాగమణి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన నాగమణి, నాగరాజులు తమ తండ్రికి చెందిన భూమిని భీమారం మండల కేంద్రానికి చెందిన మాటేటి మల్లిక తమకు తెలియకుండా పట్టా చేసుకున్నారని ఫిర్యాదు చేశారు.
- వేమనపల్లికి చెందిన తోకల హన్మంతు రాజారం గ్రామ శివారులో తన భూమిని కొందరు దౌర్జన్యం ఆక్రమించుకోగా కోర్టు ద్వారా పొందానని, ఆ భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని అర్జీ సమర్పించాడు.
- తాండూరు మండలం కొత్తపల్లికి చెందిన హేమలత ప్రభుత్వ జీవో 59 ప్రకారం ఇల్లు, ప్రభుత్వ స్థలం పొందానని ఆ భూమికి పట్టా ఇప్పించాలని కోరింది.
- జన్నారం మండలం రేండ్లగూడకు చెందిన ఎం డి.ఆహ్మద్ తన గ్రామ శివారులోని భూమికి కొలతలు చేయించాలని కోరాడు.



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

పాదయాత్రకు అనుమతి ఇవ్వాలి

కోటపల్లి: కోటపల్లి నుంచి పార్‌పల్లి వరకు రోడ్డు నిర్మాణానికి బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే పాదయాత్రకు అనుమతి ఇప్పించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డు సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారుల వైఖరికి నిరసనగా పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. గతంలో అనుమతి కోసం పోలీసులకు దరఖాస్తు చేసినా ముందస్తుగానే అదుపులోకి తీసుకున్నారని, శాంతియుతంగా చేపట్టే పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు

‘ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం’

మంచిర్యాలటౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని, అవసరమైన అభివృద్ధి పనులు చేస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో మహాప్రస్థానం, మాతాశిశు ఆరోగ్య కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాలు, మార్కెట్‌లోని రోడ్ల వెడల్పు పనులు అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలుపుతాననే హామీ ఇచ్చానని, నిలబట్టుకునేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నానని అన్నారు. మార్కెట్‌లో రోడ్ల వెడల్పుతో వచ్చే 30ఏళ్ల వరకు ఈ ప్రాంత ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని, రాబోయే తరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేపడుతున్నామని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధిని అడ్డుకునేందుకు యత్నిస్తున్నాయని ఆరోపించారు. ఎవరెన్ని అడ్డంకులను సృష్టించినా ఈ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా పనులు చేపడుతానని స్పష్టం చేశారు.



ఆసుపత్రి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

టాలెంట్ టెస్ట్

మంచిర్యాలఅర్బన్: జాతీయ సైన్స్ దినోత్స.వం సందర్భంగా ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్ (ఎఫ్‌పీఎస్‌టీ) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్‌స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు డీఎస్‌వో మధుబాబు తెలిపారు. ఈ నెల 29న పాఠశాల స్థాయి, 30న మండల, ఫిబ్రవరి 4న జిల్లాస్థాయి, 12న రాష్ట్రస్థాయి పోటీలుంటాయని తెలిపారు. వివరాలకు ఫోరమ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ జిల్లా బాధ్యులు రాజన్న, శ్రీమూర్తి, రాజేశం, కుమారస్వామిలను సంప్రదించాలని తెలిపారు.

రగ్బీ ఎంపిక పోటీలు ప్రారంభం

నస్పూర్: జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–15 బాలబాలికల ఎంపిక పోటీలను సోమవారం స్థానిక కేజీఏ డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్‌లో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రగ్బీ క్రీడకు ఆదరణ పెరుగుతోందని, అన్ని మండలాల్లో అభివృద్ధి చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే విధంగా శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీఏ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేష్, కోచ్ రమేష్, పీఈటీలు దేవేందర్, వెంకటేష్, సురేష్, ధరణ్, నర్సింలు, కుమార్ పాల్గొన్నారు.



రగ్బీ పోటీలకు హాజరైన క్రీడాకారులు

క్లుప్తంగా

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో రేంజ్ అధికారి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ పరిధి దండేపల్లి మండలం లింగాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుచ్చన్న ఇంట్లో సోమవారం తనిఖీ చేయగా కలపను లభించింది. స్వాధీనం చేసుకున్న కలపను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని రేంజ్ అధికారి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరు మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

సోన్: మండల కేంద్రంలోని ఐబీ వద్ద కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా మంజులాపూర్ గ్రామానికి చెందిన అంగాల పోతగౌడ్(63) సోమవారం గోదావరినది మాదాపూర్ ఘాట్‌కు స్నానం చేసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఆర్మూర్ నుంచి నిర్మల్‌కు వస్తున్న కారు డ్రైవర్ మల్లికార్జున్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలైన పోతగౌడ్‌ను అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడని ఏఎస్సై షేక్ అహ్మద్ తెలిపారు. సీఐ నవీన్‌కుమార్ ఘటనస్థలాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ ఎక్స్‌రోడ్ వద్ద ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం.. సోమవారం భైంసా నుంచి ఆర్టీసీ బస్సు నిర్మల్ వెళ్తోంది. భైంసా నుంచి నిర్మల్ వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు కొంతమేర దెబ్బతింది. ఆర్టీసీ డ్రైవర్ లింగన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి రిమాండ్

బెజ్జూర్: రోడ్డు ప్రమాద కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన దుబ్బుల నరేశ్ రోడ్డు ప్రమాద కేసులో కోర్టుకు హాజరుకానందున నాన్‌బెయిల్ వారెంట్ జారీ అయింది. సోమవారం నరేశ్‌ను అదుపులో తీసుకుని సిర్పూర్ కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 14 రోజులపాటు రిమాండ్ విధించారని ఎస్సై పేర్కొన్నారు.

‘ఉపాధి’లో పొలంబాట

- ప్రతీ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు
- రైతుల పనులకు ప్రాధాన్యం
- మార్చినెలాఖరులోగా పూర్తికి కసరత్తు



కోటపల్లి మండలం బొప్పారంలోని పొలాలకు వెళ్లే బురద దారి

కోటపల్లి: జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో రైతుల పొలాల్లోని బాటలను అభివృద్ధి చేసేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంతో ఏళ్లుగా పొలాల్లో రాకపోకలకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీరనున్నాయి. గతంలో నక్ష బాటలు, పూర్వకాలం నుంచి బండ్ల బాటలు ఉన్న ప్రాంతాల్లో రహదారులను బాగు చేయగా..తాజాగా రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. మార్చి నెలాఖరులోగా ఈ పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. వీటిలో జలసంరక్షణ పనులతోపాటు రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఉన్న కాలినడక బాటలను బాగు చేసేందుకు చర్యలు చేపట్టారు.

నిధులు కేటాయింపు

రైతుల పొలాల మధ్య ఉన్న కాలిబాటలను దారులుగా మార్చేందుకు ఉపాధిహామీ పథకంలో కొంతమేర నిధులు కేటాయించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఆ నిధులతో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో రైతుల అంగీకారం మేరకు పనులు చేపట్టనున్నారు.

రైతులకు ఉపయోగపడేలా..

రైతులకు ఉపయోగపడేలా పశువుల షెడ్లు, అజోల్లా పెంపకం, వర్మీ కంపోస్టు తయారీ పనులు జలనిధి ద్వారా చెక్‌డ్యాం నిర్మాణం, ఇంకుడుగుంతలు, వ్యవసాయబావులు, వర్షం నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు చేపట్టనున్నారు. పొలాల బాటల అభివృద్ధి కోసం ప్రతీ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు వెచ్చించనున్నారు. తమ ఆవాసాల నుంచి పొలాలకు చేరేందుకు రైతులు సరైన రోడ్లు లేక ఒడ్డు, గట్ల మధ్య నడిచి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు, బోరు మోటార్లు, పైపులు తదితర సామగ్రిని మోసుకెళ్లేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వారి కష్టాలు వర్ణనాతీతం. ప్రభుత్వం పొలాలకు బాటాలు బాగు చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లా వివరాలు..

జిల్లా	మండలం	పంచాయతీలు	జాబ్‌కార్డులు	కూలీలు
ఆదిలాబాద్	17	468	1,75,747	3,70,082
కుమురంభీం	15	335	1,29,885	2,77,287
నిర్మల్	18	396	1,80,572	3,70,550
మంచిర్యాల	16	311	1,21,067	2,55,151

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ నిర్ణయంతో పొలాలకు కాలిబాటల్లో వెళ్లే రైతుల ఇబ్బందులు తీరుతాయి. పొలాల మధ్య నుంచి తమ బావుల వద్దకు వెళ్లే రైతుల అంగీకారంతో పనులు చేపడుతాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– కిషన్, డీఆర్‌డీవో, మంచిర్యాల జిల్లా

రావిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



జంగుబాయికి మొక్కు

- తరలివచ్చిన భక్తులు
- నేడు కేస్లాపూర్‌కు అమ్మవారు
- ముగియనున్న ఉత్సవాలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని మహారాజ్‌గూడ సమీపంలో ఈనెల 1 నుంచి ప్రారంభమైన జంగుబాయి ఉత్సవాలు ముగియనున్నాయి. బుధవారం నుంచి ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నాగోబా పూజ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి జంగుబాయి అమ్మవారు కేస్లాపూర్‌కు చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి. ముగింపు సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి జంగుబాయిని దర్శించుకుని పూజలు చేశారు. మొక్కు చెల్లించుకున్నారు. సుమారు 316 మేళంలు అమ్మవారిని దర్శించుకున్నాయి. ఇప్పటివరకు 2.10 లక్షల మందికి పైగా దర్శించుకున్నట్లు ఆలయ కమిటీసభ్యులు శ్యాంరావు, మరప బాజీరావు తెలిపారు.

నేడు దేవతల విగ్రహాల శుద్ధీకరణ

మంగళవారం సాయంత్రం కపిలయి, సిద్ధికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లో గల పవిత్ర నదుల్లో నుంచి గంగాజలాన్ని తీసువచ్చి దేవతా విగ్రహాలను శుద్ధిచేస్తారు. తర్వాత నాగోబా పూజకు అమ్మవారు వెళ్లనుండడంతో అదే రోజు చివరిగా కటోడాలు ఖరారు చేశారు. దేవతల శుద్ధితో జంగుబాయి ఉత్సవాలు ముగుస్తాయి.



మైసమ్మకు పూజలు చేస్తున్నభక్తులు



భేటింగ్ అవుతున్న మహిళలు

‘కాంగ్రెస్ పాలన మాకొద్దు’



నిరసన తెలుపుతున్న ముఖరా(కే) గ్రామస్తులు

ఇచ్చోడ: కాంగ్రెస్ పాలన మాకొద్దంటూ మండలంలోని ముఖరా(కే) గ్రామంలో సోమవారం గ్రామస్తులు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి మాట్లాడుతూ గణతంత్ర వేడుకల సందర్భంగా అర్హులందరికీ రేషన్‌కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి మిగతావారికి మొండిచెయ్యి చూపిందని ఆరోపించారు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 13 నెలల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు తిరుపతి, విఠల్, దత్తు, అశోక్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైంది. వివరాల ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గోల్కొండ పోచమల్లు సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు కుటుంబంతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగి రేకుల ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు అందించిన సమాచారంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఆర్ఐ భానుచందర్, పంచాయతీ కార్యదర్శి లావణ్య సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పంచనామా నిర్వహించారు. ప్రమాదంలో స్టడీ సర్టిఫికెట్లు, రూ.లక్ష నగదు, 2 తులాల బంగారంతోపాటు ఇంటి సామిగ్రి, 4 క్వింటాళ్ల బియ్యం, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.6 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బాధితుడికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు.

రాంనగర్‌లోని ఇంట్లో..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని రాంనగర్‌కాలనీలో సాయికిరణ్ ఇంట్లో సోమవారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. మావల వైపు నుంచి ఆదిలాబాద్ వస్తున్న ఎస్పీ గౌస్ ఆలం గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. మంటలార్పే వరకు అక్కడే ఉన్నారు. ఇంట్లో కూలర్ వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగిందని ఫైర్ అధికారులు గుర్తించారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని కాలనీవాసులు తెలిపారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, మావల ఎస్సై విష్ణువర్ధన్ ఉన్నారు.

కిరాణాషాపులో అగ్నిప్రమాదం

చింతలమానెపల్లి: మండలంలోని కోయపెల్లి గ్రామంలో కిరాణాషాపు సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో తినుబండారాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సామగ్రి కాలిపోయాయి. స్థానికులు నీటి చల్లడంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అధికారులు తనను ఆదుకోవాలని బాధితుడు కుమురం కనకయ్య కోరాడు.

ప్రమాదవశాత్తు స్కూటీ..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలో స్కూటీ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన అంకన్న సోమవారం సాయంత్రం స్కూటీపై బూర్గుడ గ్రామానికి వెళ్తున్నాడు. జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ వద్ద స్కూటీ నుంచి శబ్దం రావడంతో ఆపి చూసేసరికి బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించి దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. దివ్యాంగుడైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని అంకన్న వేడుకున్నాడు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎల్లక్కపేటలోని ఆది శంకరాచార్య జిన్నింగ్ మిల్లులో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. మిల్లు ఆవరణలో నిల్వ ఉంచిన పత్తి కుప్పలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది వెంటనే చెన్నూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మరో ఫైరింజన్ తెప్పించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంపై మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులును వివరణ కోరగా, మంటలు ఎలా అంటుకున్నాయో సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని, కాలిన పత్తి, నష్టం వివరాలను అంచనా వేసి వెల్లడిస్తామన్నారు.

పెరటిలో గంజాయి పెంపకం



పెరటిలో పెంచిన గంజాయి మొక్క

వేమనపల్లి: రైతు తన పెరటిలో రెండు గంజాయి మొక్కలు పెంచి పోలీసులకు దొరికిపోయాడు. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ కథనం ప్రకారం.. వేమనపల్లికి చెందిన రైతు తెల్ల నారాయణ తన ఇంటి వెనుకాల ఉన్న పెరటిలో రెండు గంజాయి మొక్కలు నాటాడు. నిత్యం గంజాయి సేవిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై సోమవారం ఆయన ఇంటికి వెళ్లి తనిఖీ చేశారు. నారాయణ వద్ద ఉన్న 584 గ్రాముల ఎండు గంజాయితోపాటు ఒక చెట్టును స్వాధీనం చేసుకున్నారు. పక్వానికి వచ్చిన చెట్టును పీకి వేసి లుంగీలో మూటగట్టి గడ్డివాములో దాచి ఉంచినట్లు తెలిపారు. గంజాయి మొక్కగా ఏవో వీరన్న గుర్తించారు. దీని విలువ రూ.10 వేలు, ఎండు గంజాయి రూ.14,600 ఉంటుందని ఎస్సై తెలిపారు. నారాయణను అదుపులో తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

356 కిలోల గంజాయి ధ్వంసం



పట్టుకున్న గంజాయితో ఎక్సైజ్ సిబ్బంది

ఇచ్చోడ: వివిధ కేసుల్లో పట్టుకున్న 356 కిలోల గంజాయిని ధ్వంసం చేసినట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద గల మెడికేర్ సర్వీస్ సెంటర్‌కు గంజాయిని తరలించి అక్కడి ఎలక్ట్రికల్ యంత్రంతో సోమవారం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తుపాకీతో బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

మంచిర్యాలక్రైం: తుపాకీతో చంపుతానని బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల సాధారణ జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.నిరోష సోమవారం తీర్పునిచ్చింది. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన వినోద్ మహార్ పానీపూరి బండి నిర్వహిస్తున్నాడు. అతని వద్ద మధ్యప్రదేశ్‌కు చెందిన గ్యాప్రసాద్ అలియాస్ రాజు కొంతకాలం పనిచేసి మానేశాడు. 2016 నవంబర్ 12న ఇద్దరి మధ్య లావాదేవీల విషయంలో గొడవపడ్డారు. రాజు తుపాకీతో చంపుతానని బెదిరించడంతో వినోద్‌మహార్ అదేనెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ డి.సుధాకర్ కేసు దర్యాప్తు చేపట్టి రాజును రిమాండ్‌కు తరలించి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రవీందర్ సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. నిందితుడు రాజుకు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చింది.

చుక్కల దుప్పిని చంపిన కేసులో ఇద్దరికి బెయిల్

చెన్నూర్‌రూరల్: చుక్కల దుప్పిని చంపిన కేసులో ఇద్దరికి సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. ఎఫ్ఆర్వో శివకుమార్ కథనం ప్రకారం..మండలంలోని శివలింగాపూర్‌కు చెందిన బోయప్రసాద్, నక్క మహేందర్, ఊరటి పోచంలు గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి చుక్కల దుప్పిని హతమార్చారు. ఈనెల 24న రాత్రి సమయంలో నక్క మహేందర్ ఇంట్లో దుప్పిని కోసి పోగులు వేస్తుండగా అటవీ అధికారులు దాడి చేసి ప్రసాద్, మహేందర్‌లను పట్టుకున్నారు. పోచం పరారీలో ఉన్నాడు. పట్టుకున్న ఇద్దరిని సోమవారం మంచిర్యాల కోర్టులో హాజరుపర్చగా సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. డిప్యూటి రేంజ్ అధికారి ప్రభాకర్, బీట్ అధికారి స్వప్న, సెక్షన్ అధికారులు రాజేష్, చంద్రమోహన్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



గంధం సంతోష్

నిర్మల్‌టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గాంధీనగర్ కాలనీకి చెందిన గంధం సంతోష్ ఈనెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే సెల్ 87126 59511, 87126 59512 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

ఖందేవుని ఆలయంలో ఎంపీ పూజలు



బేలలో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్



నార్నూర్: పూజలు చేస్తున్న ఎంపీ గోడం నగేశ్

నార్నూర్: మండల కేంద్రంలోని తొడసం వంశీయుల ఆరాధ్యదైవం ఖందేవుని ఆలయంలో ఎంపీ గోడం నగేశ్ సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఖందేవ్ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మహాపూజ కోసం తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు భిక్షపతి రాథోడ్, ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు, బీజేపీ బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జ్ఞానోబా పుస్కర్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాల్కుర్ ప్రకాశ్, నాయకుడు మాడవి చంద్రహరి తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

బేల: సదల్‌పూర్ మహాదేవ్, బైరందేవ్ ఆలయాల అభివృద్ధి కృషి చేస్తానని ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. సోమవారం జంగీ జాతర పురస్కరించుకొని మండలంలోని సదల్‌పూర్ మహాదేవ్, బైరందేవ్ ఆలయాలను సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆదివాసీ దర్బార్ సభలో ఆయన మాట్లాడుతూ పుష్యమాసం ఆదివాసీలకు చాలా పవిత్రమని, నెలరోజులు భక్తిశ్రద్ధలతో కుల దైవాలను పూజిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమన్వయంతో ఆలయాల అభివృద్ధికి చొరవ తీసుకుంటామన్నారు. కాగా ఆలయాలకు ప్రహరీ, ఒక బోరు సౌకర్యం, సదల్‌పూర్ నుంచి ఆలయాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతోపాటు ఆలయాల ఆధునికీకరణ కోసం ఆలయ కమిటీ సభ్యులు ఎంపీకి వినతిపత్రం అందించారు. బీజేపీ నాయకులు పాయల్ శరత్, దత్తా నిక్కమ్, ఇంద్రశేఖర్, రాందాస్, దేవ్‌రావు, మోరేశ్వర్, గణేశ్, ఆలయ కమిటీ సభ్యులు శ్యాంరావు, కుషాల్‌రావు, సోనేరావు ఉన్నారు.

మళ్లీ చదువుకునే అవకాశం

- మధ్యలో మానేసిన వారికి, ఓపెన్ స్కూల్ ద్వారా
- నేడు, రేపు తత్కాల్ ప్రవేశాలు



దండేపల్లిలో ఓపెన్ తరగతుల బోధన

దండేపల్లి: వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారు మళ్లీ చదువుకునేందుకు తెలంగాణ సార్వత్రిక పీఠం(ఓపెన్ స్కూల్ సొసైటీ) అవకాశాన్ని కల్పిస్తోంది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ ఇదివరకే పూర్తయినప్పటికీ, ఈనెల 27 నుంచి 29 వరకు తత్కాల్ విధానంలో ప్రవేశాలకు మరో అవకాశం కల్పించింది. టెన్త్, ఇంటర్ చదువుకోవాలనేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సెలవురోజుల్లో తరగతులు..

పదో తరగతికి 14, ఇంటర్మీడియెట్ ప్రవేశానికి 15 ఏళ్లు నిండి ఉండాలి. బడి మధ్యలో మానేసినవారు పది, పదో తరగతి పూర్తయిన వారు ఇంటర్ చదవొచ్చు. సరళమైన విద్యావిధానం, సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తారు. మహిళలు, పలు వృత్తి, వ్యాపారాల్లో ఉన్నవారు, ప్రజాప్రతినిధులు, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వారికి సదావకాశం. స్వీయ అభ్యసన సామగ్రి అందజేస్తారు. యూట్యూబ్ ఛానల్, వెబ్‌సైట్ ద్వారా పాఠ్యాంశాలు నేర్చుకోవచ్చు. ఒకసారి ప్రవేశం పొందినప్పటి నుంచి 5 ఏళ్లు లేదా 9 పర్యాయాలు పబ్లిక్ పరీక్షలు రాయొచ్చు. ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల ద్వారా ఈనెల 29 లోగా దరఖాస్తు ఫీజు చెల్లించవచ్చు.

ఉమ్మడి జిల్లాలో ఓపెన్ అధ్యయన కేంద్రాలు..

జిల్లా	కేంద్రాలు	(టెన్త్, ఇంటర్)లో ఇప్పటివరకు ప్రవేశాలు
ఆదిలాబాద్	11	890
కుమురంభీం	10	485
మంచిర్యాల	13	1370
నిర్మల్	14	1077

దరఖాస్తు చేసుకోవాలి

వివిధ కారణాలతో చదువు మానేసి, మళ్లీ చదువుకోవాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. తత్కాల్ ప్రవేశాలకు రెండు రోజులు అవకాశం ఉన్నందున ఆసక్తి ఉన్నవారు ఎవరైనే ఉంటే దరఖాస్తు చేసుకోవాలి.
– అశోక్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్

ట్రిపుల్‌ఐటీలో ప్రొఫెసర్ల నిరసన



బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సోమవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తంచేశారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అధ్యక్షుడు ఉపేందర్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నామని తెలిపారు. 77 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో జీవనం కొనసాగిస్తున్నామన్నారు. ట్రిపుల్‌ఐటీ భాగస్వాములమైన తమకు యూజీసీ పేస్కేల్‌తో కూడిన గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏతోపాటు మూడు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.